క్లుప్తంగా

నగదు రహిత సేవలపై సమీక్ష



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నగదు రహిత సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోనున్నామని ఈవో శీనానాయక్ అన్నారు. ఈవో చాంబర్‌లో శనివారం దేవదాయ శాఖ ఐటీ మేనేజర్ ప్రసాద్, బ్యాంక్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు ఆలయ ప్రాంగణంలో టికెట్లు తీసుకునేందుకు వీలుగా ఆధునిక కంప్యూటర్ల ఏర్పాటుకు బ్యాంక్ అధికారులతో చర్చించారు. తిరుమలలో ఇటీవల బ్యాంక్ ఏర్పాటు చేసిన మోడల్స్‌ను ఈవో శీనానాయక్ పరిశీలించారు. దేవస్థానానికి విరాళాలు, దర్శన టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు కొనుగోలుతో పాటు ప్రసాదాల కొనుగోలుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అమ్మవారికి నిర్వహించే అన్ని సేవలను ఆన్‌లైన్ ద్వారా భక్తులకు చేరవేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, దేవస్థాన ఏఈవో జంగం శ్రీనివాసరావు, ఐటీ విభాగం పర్యవేక్షకులు హరీష్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రిటైర్డ్ పోలీసులను శనివారం దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. సీఎస్‌బీ ఎస్‌ఐ సి.హెచ్.శ్రీనివాసరావు, జగ్గయ్యపేట ఎస్‌ఐ బి.ఈ.వెంకటేశ్వరరావు, రిజర్వ్ ఎస్‌ఐ ఎస్.సత్యనారాయణ, పటమట ఏఎస్‌ఐ కె.వి.ఎల్.నారాయణ, ట్రాఫిక్ ఏఎస్‌ఐ సయ్యద్ రియాజుద్దీన్, తిరువూరు ఏఎస్‌ఐ సి.హెచ్.వెంకటేశ్వరరావు, సౌత్ ఏసీపీ కార్యాలయం హోంగార్డు బక్కా శ్రీనివాసరావు, వన్‌టౌన్ హోంగార్డు కొల్లూరి నాగేశ్వరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో సునీత, ఏఆర్ ఏసీపీ ప్రసాదరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

వెలమ నేస్తం పథకాన్ని అమలు చేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో వెలమ కులస్తుల సంక్షేమానికి వెలమ నేస్తం పథకాన్ని అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 లక్షల జనాభా కలిగిన వెలమ సామాజిక వర్గానికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో న్యాయం చేయాలన్నారు. విశాఖ, తిరుపతి, సింహాచలంలలో వెలమ భవనాలకు స్థలాలు కేటాయించాలని కోరారు. వెలమ నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి వెలమ సామాజిక వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో త్వరలో వెలమ గర్జన పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

బుడమేరును నిర్లక్ష్యం చేస్తున్న పాలకులు

కంకిపాడు: ఆపరేషన్ బుడమేరు వెంటనే చేపట్టాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. సీపీఐ, రైతు సంఘాల ప్రతినిధులతో కలిసి శనివారం కంకిపాడు మండలంలోని బుడమేరు ప్రభావిత ప్రాంతాలైన ఉప్పలూరు, వేల్పూరు, మంతెన, తెన్నేరు తదితర గ్రామాల్లో పర్యటించారు. బెజవాడ దుఃఖదాయనిగా పేరొందిన బుడమేరును పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వరదలతో అనేక ప్రాంతాల్లో గండ్లు పడి పొలాలు నీట మునిగిపోయి, ఇళ్లు ధ్వంసమై ప్రజలు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి మురుగు పారుదల అవ్వటం లేదన్నారు. ఆధునికీకరణ పనులను చేపట్టకుండా రైతులను నిర్లక్ష్యం చేస్తూ పాలకులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ బుడమేరుపై ఈనెల 6న విజయవాడలో నిర్వహిస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ బుడమేరు దుస్థితిని ఇరిగేషన్ మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు పట్టించుకోలేదన్నారు. బుడమేరు ప్రారంభం నుంచి సముద్రంలో కలిసే వరకూ ఉన్న అనేక ప్రదేశాల్లో ఆక్రమణకు గురై కుంచించుకు పోయి తన స్వరూపాన్ని కోల్పోయిందన్నారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి బుడమేరు ఆధునికీకరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చిట్టడవిని తలపిస్తున్న అంతర్గత రహదారులు

- మెయిన్ రోడ్‌కు వెళ్లేందుకు అవస్థలు పడుతున్న 30 కుటుంబాలు
- తాగునీరు తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న మహిళలు
- అంతర్గత రహదారిని ఆక్రమించి మూసివేత
- అత్యవసర దారులను వదిలేసి అనవసర రోడ్ల నిర్మాణం



చిట్టడవిని తలపిస్తున్న 300 ఎస్ఎఫ్టీ 4,5,6,7 బ్లాకుల మధ్య కామన్ అంతర్గత రహదారి

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక హౌసింగ్‌బోర్డ్ కాలనీ పరిధిలోగల 300–450 ఎస్ఎఫ్టీ వెలంపల్లి శ్రీనివాసరావు కాలనీలోని అంతర్గత కామన్ రహదారుల్లో పెరిగిన పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తున్నాయి. 300 ఎస్ఎఫ్టీ 4,5,6,7 బ్లాకులు, 450 ఎస్ఎఫ్టీ 11,12, 300 ఎస్ఎఫ్టీ 12,13 బ్లాకుల మధ్య కామన్ దారిలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. 300 ఎస్ఎఫ్టీ 13వ బ్లాకులో నివసిస్తున్న 30 కుటుంబాలు మెయిన్ రోడ్ మీదకు వెళ్లేందుకు సరైన దారి లేక 12వ బ్లాకు పార్కింగ్ ప్రదేశం గుండా రాకపోకలు సాగిస్తుంటే ఆ బ్లాక్‌లో నివసిస్తున్నవారు అభ్యంతరం పెడుతున్నారు. దీంతో వారు ఎటు నుంచి రాకపోకలు సాగించాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. 13వ బ్లాకులో నివసిస్తున్న వారికి ఆరోగ్య సమస్యలు ఏర్పడితే అంబులెన్స్ లోపలకు వచ్చే పరిస్థితి లేదు. పక్కనే ఉన్న మంచినీటి కుళాయి నుంచి తాగునీరు తీసుకువెళ్లాలంటే మెట్ల పక్కనే కేవలం అడుగున్నర వెడల్పులో ఉన్న కరెంట్ బస్‌బార్ (విద్యుత్ మీటర్ల బాక్స్) ఆనుకుని వెళ్లాల్సి రావడం ప్రమాదకరంగా మారింది. బిందెతో మంచినీళ్లు తీసుకువెళుతున్న సందర్భంలో పొరపాటున కరెంట్ బస్‌బార్‌కు తగిలితే జరిగే పరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అసలే రహదారి లేక ఇబ్బందులు పడుతుంటే ఆయా బ్లాకుల మధ్య స్థలాన్ని ఆక్రమించుకుని దారి మూసేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆక్రమణలకు పాల్పడితే మిగతా వారి పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మించాల్సిన అంతర్గత రోడ్లను వదిలేసి...

కాలనీలో వివిధ బ్లాకుల మధ్య అత్యవసరంగా నిర్మించాల్సిన అంతర్గత రోడ్లను వదిలేసి ఎవరూ రాకపోకలు సాగించని అనవసరమైన రోడ్లను నిర్మించటంపై మండిపడుతున్నారు. అభివృద్ధి పనుల విషయంలో కూడా వివక్ష చూపితే ఎలా అని వాపోతున్నారు. కాలనీలో 300 ఎస్ఎఫ్టీ 12, 13 బ్లాక్‌ల వెనుక ఏర్పాటు చేసిన పార్క్‌కు మూడు వైపులా ప్రహరీ నిర్మించి నాలుగవ వైపు (450ఎస్ఎఫ్టీ 11,12 బ్లాకుల మధ్య, 300 ఎస్ఎఫ్టీ 13వ బ్లాకు పక్కన ప్రహరీ నిర్మించకుండా వదిలేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే 450 ఎస్ఎఫ్టీ 4,



విద్యుత్ మీటర్లు ఉన్న కరెంట్ బస్ బార్ ముందు నుంచి తాగునీరు తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్న మహిళ

5 బ్లాకు మధ్యలో అత్యవసరం కాక పోయినా (వెనుక ఉన్న 300 ఎస్ఎఫ్టీ 2, 3 బ్లాకుల వారి రాకపోకలకు సీసీ రోడ్ ఉండగా) అంతర్గత రోడ్ నిర్మాణ పనులను మొదలు పెట్టటంలో ఆంతర్యం మున్సిపల్ అధికారులకే తెలియాలని వ్యాఖ్యానిస్తున్నారు. కాలనీలోని ఒక



300 ఎస్ఎఫ్టీ 12-13 బ్లాకుల మధ్యలో దారిని ఆక్రమించి మూసేసిన వైనం

పార్క్‌కు వెళ్లే దారిలో పేవర్ బ్లాకులతో దారి ఏర్పాటు చేసి మరో పార్క్‌కు వెళ్లే అంతర్గత రోడ్డు నిర్మించకుండా వదిలేయటం వివక్ష కాక మరేమిటని అంటున్నారు.

కామన్ అంతర్గత రహదారులను నిర్మించాలి

300–450 ఎస్ఎఫ్టీ వెలంపల్లి కాలనీలోగల కామన్ అంతర్గత రహదారులను నిర్మించాలని కొన్ని బ్లాకుల బాధితులు నగరపాలక సంస్థ కమిషనర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. కామన్ అంతర్గత దారుల్లో సిమెంట్ రోడ్లు వేయకపోయినా కనీసం పిచ్చి మొక్కలను తొలగించి మార్గాన్ని సుగమం చేయాలని కోరుతున్నారు. కొన్ని బ్లాకుల మధ్య దారి లేకుండా కొందరు ఆక్రమించుకుని మూసేసిన దారులపై దృష్టి సారించి ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కాలనీలో కొందరు వ్యక్తులు తమ ఆధిపత్యం కొనసాగాలనే ఉద్దేశంతో వర్గాలుగా ఏర్పడటంతో కాలనీ పూర్తి స్థాయి అభివృద్ధికి ఆటంకాలు కలుగుతున్నాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొన్ని చోట్ల అభివృద్ధి పనులు జరగటం, మరి కొన్ని చోట్ల జరగకపోవడమే తార్కాణంగా కనబడుతోంది. ఏది ఏమైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది.

శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం

డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ డాక్టర్ లత



భవానీపురం(విజయవాడపశ్చిమ): పిల్లల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని, ఆ దిశగా సంబంధిత అధికారులు కృషి చేయాలని డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ (వీఎంసీ) డాక్టర్ కేఎస్‌బీఎస్ లత అన్నారు. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు సందర్భంగా శిక్షణలో పాల్గొన్న బాలబాలికలకు శనివారం గురునానక్ కాలనీలోగల స్విమ్మింగ్‌పూల్‌లో ఈత పోటీలు నిర్వహించారు. ప్రతిభావంతులకు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లత మాట్లాడుతూ వేసవి క్రీడా శిక్షణలో భాగంగా మే 1 నుంచి 31 వరకు నగర పాలక సంస్థ పరిధిలోగల అన్ని వీఎంసీ వేసవి శిక్షణ కేంద్రాల్లో స్కేటింగ్, షటిల్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ వంటి క్రీడల్లో శిక్షణ ఇచ్చారని తెలిపారు. శనివారం ముగింపు కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ఈత పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ కేటగిరీలుగా విభజించి 12 మంది ప్రతిభావంతులకు పతకాలు బహూకరించామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, మెడల్స్ స్పాన్సర్ అరుణ, స్విమ్మింగ్‌పూల్ ఇన్‌చార్జ్ అప్పారావు, కోచ్‌లు కుసుమ, గౌతమ్, బహదూర్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కర్మల భవనాలను అందుబాటులోకి తేవాలి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



జీఎస్ రాజు రోడ్డులో కూల్చేసిన కర్మల భవనం స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని కర్మల భవనాలన్నింటినీ పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఆయన తన పర్యటనలో భాగంగా శనివారం అయోధ్యనగర్, సత్యనారాయణపురం, జీఎస్ రాజు రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఎస్ రాజు రోడ్డులో కూల్చేసిన పాత కర్మల భవనం స్థలంలో నూతన కర్మల భవనాన్ని నిర్మించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోగల కర్మల భవనాలకు మరమ్మతులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఎస్టేట్ విభాగం ఇంజినీరింగ్ విభాగం అధికారులు సమన్వయంతో నగరపాలక సంస్థకు చెందిన ఆస్తులను పరిశీలించి వాటిని కాపాడాలని సూచించారు. అనంతరం అయోధ్యనగర్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, తాగునీరు, వాడకం నీరు సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అన్న క్యాంటీన్లలో మరమ్మతులు ఉంటే ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆయనతోపాటు 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి ఉన్నారు.

కేఎల్ రావు స్విమ్మింగ్‌పూల్‌లో ముగిసిన సమ్మర్ క్యాంప్

ఆఖరి రోజు చిన్నారులకు పోటీలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగిసింది. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్విమ్మింగ్‌లో శిక్షణ పొందిన చిన్నారులకు శనివారం పోటీలను నిర్వహించారు. వివిధ కేటగిరీలలో నిర్వహించిన పోటీలను కోచ్ రఫీ, సీనియర్ స్విమ్మర్లు పర్యవేక్షించగా, పోటీలలో పలువురు చిన్నారులు రాణించారు. క్యాంప్ చివరి రోజు కావడంతో చిన్నారుల తల్లిదండ్రులు, అన్నాచెల్లెలు, తమ్ముళ్లు భారీగా స్విమ్మింగ్ పూల్ వద్దకు చేరుకున్నారు. పోటీలు ఆద్యంతం ఎంతో ఆసక్తిగా, కేరింతల మధ్య సాగగా, పోటీలలో గెలుపొందిన వారితో పాటు క్యాంప్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ విజయవాడ నగర పాలక సంస్థ స్పోర్ట్స్ డైరెక్టర్ లత మెడల్‌తో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. సమ్మర్ క్యాంప్‌లో మెలకువలు నేర్చుకున్న చిన్నారులు, యువతీ, యువకులు భవిష్యత్తులో మంచి స్విమ్మర్లుగా రాణించాలంటే మరింత శిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఉందని కోచ్ రఫీ పేర్కొన్నారు.

స్నాన ఘాట్లలోకి డ్రైనేజీ మురుగు



టాయిలెట్స్ నుంచి బయటకు వస్తున్న మురుగు



స్నానఘాట్ వద్ద డ్రైనేజీ వ్యర్థాలు

- దుర్గాఘాట్‌లో నదీజలాలు కలుషితం
- దుర్వాసనతో భక్తుల ఇక్కట్లు
- ఈవోకు చెప్పినా స్పందన నిల్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): నిత్యం వేలాది మంది పుణ్యస్నానాలు ఆచరించే దుర్గాఘాట్‌లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో భక్తులు, యాత్రికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నదిలో నిండుగా నీళ్లు ఉండటంతో భక్తులు, యాత్రికులతో పాటు నగర వాసులు సైతం దుర్గాఘాట్‌కు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. దుర్గాఘాట్‌ను వారం రోజుల కిందట ఈవో శీనానాయక్ తనిఖీ చేశారు. ఘాట్‌లో ఎప్పటి చెత్తను అప్పడే తొలగించాలని, దుస్తులు మార్చుకునే గదుల వద్ద అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలని ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులను ఆదేశించారు. అయితే శనివారం ఉదయం షిఫ్టులో ఇద్దరంటే ఇద్దరు సిబ్బందిని మాత్రమే నియమించడంపై ఈవో ఆదేశాలను ఏరీతిలో అమలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. స్నానఘాట్ల మెట్లపై ఎక్కడ చూసినా భక్తులు వదిలేసిన దుస్తులు, సబ్బు ముక్కలే దర్శనమిచ్చాయి.

మురుగు నీరు నదిలోకి...

స్నానఘాట్‌లో దేవస్థానం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల వద్ద అపరిశుభ్ర వాతావరణమే కనిపిస్తోంది. మరుగుదొడ్లు వినియోగించిన వారు కాళ్లు శుభ్రం చేసుకున్న నీటితో పాటు టాయిలెట్స్ వ్యర్థాలు కచ్చా డ్రైన్ ద్వారా నేరుగా నదిలోకి చేరుతున్నాయి. దీంతో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మెట్లపై పెద్ద ఎత్తున డ్రైనేజీ వ్యర్థాలు, మట్టిని వదిలేయడంతో స్నానాల అనంతరం భక్తులు ఆ ప్రదేశంలోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. దీంతో పుణ్యస్నానాలకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులకు గురి కావడమే కాకుండా ఘాట్‌పైన దుస్తులు మార్చుకునే క్రమంలో దుర్వాసనతో దూరంగా వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

చైనావాల్ నుంచి రథం సెంటర్ వరకు ప్రక్షాళన

- ఆక్రమణల తొలగింపునకు సిద్ధమవుతున్న దేవస్థానం
- పోలీసు, వీఎంసీ అధికారులతో సమీక్ష



వెస్ట్ ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్, వీఎంసీ అధికారులతో ఈవో శీనానాయక్ సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి చైనావాల్ నుంచి బ్రాహ్మణ వీధి రథం సెంటర్ వరకు ఉన్న ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమవుతోంది. శనివారం వెస్ట్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్, దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావు, వీఎంసీ అధికారులతో ఈవో శీనానాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మహామండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ పరిసరాల్లో ఆక్రమణలపై చర్చించారు. దుర్గగుడిపై త్వరలో ప్రారంభమయ్యే ఆషాఢ మాసోత్సవాలు, నెల రోజుల పాటు అమ్మవారికి భక్తులు సారె సమర్పించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసే భక్తులు, తెలంగాణ బోనాలు, శ్రావణమాసంలో పెరిగే భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ఏడాది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని దేవస్థానం నిర్ణయించుకున్నట్లు ఈఓ తెలిపారు. దుర్గాఘాట్, కేశ ఖండనశాల, విజయేశ్వరాలయం నుంచి రథం సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలన్నీ తొలగించాల్సిందేనని దుర్గగుడి ఈవో శీనానాయక్ స్పష్టం చేశారు. వీకెండ్‌లో పెరుగుతున్న భక్తుల రద్దీ, పార్కింగ్ సమస్యతో పాటు దుర్గగుడి పరిసరాల్లో ఆక్రమణలపై సమీక్ష సమావేశంలో చర్చించారు. ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనం కల్పించేందుకు అన్ని విభాగాల సహకారం అవసరమని అన్నారు.

మహిళా వికాసంతోనే దేశాభ్యున్నతి



మాట్లాడుతున్న ఆచార్య ఉష

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళా వికాసంతోనే దేశాభ్యున్నతి సాధ్యమవుతుందని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష అన్నారు. కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో 45 రోజులపాటు నిర్వహించిన వేసవి ఉచిత శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య ఉష మాట్లాడుతూ మహిళ విజ్ఞానవంతురాలు అయితే ఆ కుటుంబం అంతా అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా శక్తి ప్రగతికి దిక్సూచి అన్నారు. పేద, దిగువ మధ్యతరగతి వర్గాల మహిళలకు అనేక రకాల చేతివృత్తులతోపాటు భాషా నైపుణ్యాలు, కంప్యూటర్ కోర్సులలో ఉచిత శిక్షణ నిర్వహించిన యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల కోసం 45కి పైగా కోర్సులను ఉచితంగా అందించామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా తమ కళాశాలలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది రెండు వేల మంది శిక్షణ పొందారని చెప్పారు. హిందూ హైస్కూల్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మహిళ విద్యావంతురాలు కావడంతో పాటు అనేక రకాల ఆధునిక నైపుణ్యాలలో కూడా తప్పనిసరిగా నైపుణ్యం సాధించాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలు, చిన్నారులకు సర్టిఫికెట్లను అతిథులు అందించారు. పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ అందుకున్న కళాశాల అధ్యాపకుడు డాక్టర్ వీటీ రాంపవన్‌ను అతిథులు ఘనంగా సత్కరించారు.

ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పోలీస్ బందోబస్తుతో మొదలుపెట్టిన వీఎంసీ అధికారులు



ఎట్టకేలకు మొదలైన రోడ్డు నిర్మాణ పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా సెంటర్‌లోని పెట్రోల్ బంక్ వెనుక రెండవ లైన్‌లో వివాదాస్పదమైన రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో మంజూరయిన నిధులతో నగరపాలక సంస్థ అధికారులు మొదలు పెడదాం అనుకునే సమయానికి ఎన్నికల కోడ్ రావడం, అనంతరం రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాలు అడ్డు రావడం వంటి ఆటంకాలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో స్థానికులు గత ఆరు నెలలుగా అటు విద్యుత్ అధికారులు, ఇటు మున్సిపల్ అధికారుల చుట్టూ తిరిగి కరెంట్ స్తంభాలను పక్కకు జరిపించుకున్నారు. అనంతరం రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిద్దామని అధికారులు, కాంట్రాక్టర్ ముందుకురాగా తన స్థలంలో రోడ్డు వేయటానికి వీలు లేదంటూ ఆ రోడ్డులో ఇల్లు ఉన్న వ్యక్తి అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కొన్ని రోజులు ఆగిపోయింది. దాంతో స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులను కలవగా, వారు సర్వే చేసి 10 అడుగుల రోడ్డు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించేందుకు శనివారం అధికారులు, కాంట్రాక్టర్ రాగా తిరిగి అదే వ్యక్తి అడ్డుపడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు వచ్చి అధికారులతో మాట్లాడి టౌన్‌ప్లానింగ్ అధికారి ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణ పనులను ఆపటానికి వీలు లేదని చెప్పటంతో ఎట్టకేలకు పనులు మొదలు పెట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ డీఈ కరుణాకర్ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లోని వేణుగోపాలస్వామి వారి ప్రాంతంలో పిళ్లా సాయిలక్ష్మి, వెంకటేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరితో పాటు సాయిలక్ష్మి తల్లి బంకా పోలమ్మ(65) ఉంటోంది. మే 29వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన పోలమ్మ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. కుమార్తె ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సత్కారం



సత్కారం అందుకున్న మేరీ ప్రశాంతితో అధికారులు, యూనియన్ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను మున్సిపల్ కార్పొరేషన్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మేరీ ప్రశాంతి, అటెండర్ ధనలక్ష్మి, టైం స్కేల్ ఎన్ఎంఆర్ శ్రీనివాస్‌లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న అడిషనల్ కమిషనర్ జనరల్ చంద్రశేఖర్, అకౌంటెంట్ బీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంటూ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించిన వారు ఇకపై తమ శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు దారా రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ చలం, చీఫ్ అడ్వైజర్ వీఎంవీ రమణారెడ్డి, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్, ఏపీటీయూసీ నాయకుడు బుద్దె రాజా తదితరులు పాల్గొన్నారు.

మంత్రిగారూ మమ్మల్ని కరుణించండి

చంద్రాల గ్రామంలో స్థలాలు కోల్పోయిన బాధితుల వినతి

మైలవరం: మంత్రిగారూ మమ్మల్ని కరుణించండి అంటూ చంద్రాల గ్రామంలో రోడ్డు వెడల్పులో స్థలాలు, ఇళ్లు కోల్పోయిన బాధితులు శనివారం రోడ్డెక్కారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా మా గోడును పట్టించుకోవడంలేదని గ్రామస్తులు రోడ్డు పక్కన మంత్రి లోకేష్ ఫొటోతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి నిరసన తెలిపారు.